# అమ్మకడుపు చల్లగా - 2

## - గొల్లపూడి మారుతీరావు



స్వర్గీయ గొల్లపూడి మారుతిరావుగారి ఆత్మకథ 'అమ్మకడుపు చల్లగా' ఇప్పటికి పదకొండు సంవత్సరాలుగా మార్కెట్‌లో ఉన్న సంగతి పాఠకులకు విదితమే. అందులో మారుతిరావుగారు 2007 వరకూ తన జీవితంలో జరిగిన సంఘటనలను అత్యంత ఆసక్తికరంగా పాఠకులకు అందించారు. దానికి కొనసాగింపుగా 2007 నుంచి తనజీవితంలోని ముఖ్యమైన సంఘటనలను, క్రిందటి సంవత్సరమే, వ్రాయడం ప్రారంభించారు. అనారోగ్యకారణాలవల్ల దాన్ని పూర్తిచేయలేకపోయారు. ఆయన వ్రాసిన కొద్దిపేజీలను వ్రాసిన వెంటనే, 2018 నవంబర్‌లో, కౌముదికి పంపించారు. పూర్తిచేసి ఉంటే ఆ పుస్తకానికి ఏమి పేరు పెట్టి ఉండేవారో! ఆ అసంపూర్తి రచనను అమ్మకడుపు చల్లగా - 2 గా కౌముది పాఠకులకు ఈ నెల నుంచి ధారావాహికంగా అందిస్తున్నాం.

*(గత సంచిక తరువాయి)*

**కొన్ని** దశాబ్దాలుగా ఆయా పత్రికలలో సాగుతున్న 'జీవనకాలమ్' మీద కొన్ని స్పందనల పాలపొంగు. ఎప్పటికప్పుడు రుచి చూడకపోతే పాలు విరిగిపోతాయి.

సాధారణంగా కాలమ్ రచన పూర్తిచేశాక ఒక స్పందన కోసం కొందరికి, అందరికీ అన్నిసార్లూ కాదు, ఫోన్‌లో చదివి వినిపించడం ఆనవాయితీ. దశాబ్దాలపాటు న్యూస్ ఎడిటర్‌గా 'హిందూ'లో పనిచేసిన బులుసు ప్రభాకర శర్మగారికి, మిత్రులు వెన్నెలకంటిగారికి, గుంటూరు లక్ష్మీనారాయణగారికి, ఒక్కోసారి కిరణ్‌ప్రభకి - ఇలాగ.

"కారణజన్ములు" కాలమ్ డాక్టర్ పప్పు వేణుగోపాలరావుగారికి చదివి వినిపించాను. "వండ్రఫుల్ మారుతీరావుగారూ ఒక్క గొంతు ఎత్తినా అది ఓంకారమవొచ్చు. తరువాత నాదంలోంచి నినాదం పుట్టొచ్చు" అన్నారు.

ఇక్కడో చిన్న పిట్టకథ. నేను కాలమ్ రాయను. పద్యంలాగా కంపోజ్ చేస్తాను. అందులో ఒక్క అక్షరం మారినా ఆరునెలలయినా గుర్తుపట్టగలను. అంతేకాదు. ఆ మార్పు నన్ను విపరీతంగా బాధపెడుతుంది. ఇప్పుడీ "కారణజన్ములు" కాలమ్‌లో ఒక వాక్యాన్ని తీసేశారు ఎడిటోరియల్ విభాగంవారు.

ఈ కాలమ్ వ్యవహారాలు కల్లూరి భాస్కరంగారనే ఉప సంపాదకులు చూస్తున్నారు. ఆ సవరణ చూడగానే నెత్తికి రక్తం ఎగదన్నింది. వెంటనే ఫోన్ చేశాను. ఇవీ నా మాటలు: "ఒక పక్క సిగ్గులేకుండా ఓ రాష్ట్రం హంతకునికి (J&K) మద్దతు యిస్తూంటే దాన్ని చెప్పడానికి ఇంకా వెనకాడే మన బలహీనత ఈ దేశపు అనర్థం. You have taken away the teeth from my column. ఇలాంటి జర్నలిజం కన్నా కిళ్ళీకొట్టు పెట్టుకోవడం నయం."

చెప్పేది పత్రికలో పనిచేస్తున్న వ్యక్తికి. చెప్తున్నది ఆవేశంతో. భాస్కరంగారు పెద్దమనిషి. ఆయన అర్థం చేసుకున్నారు. కిమ్మనలేదు. అయినా జరగాల్సిన అనర్థం ఎలానూ జరిగిపోయింది.

ఎలిజీలు కూడా నా కాలమ్‌లో భాగమే. మద్రాసులో జరిగిన తెలుగు మహాసభల కార్యవర్గ సమావేశంలో మాలతీచందూరుగారు కలిశారు. "ఎలిజీలు చదివాను. ఎంత బాగున్నాయో? ఎందరో ఆత్మీయులను తలుచుకున్నాను. నేనుపోతే ఎంత మంచి ఎలిజీ రాస్తారో అనుకున్నాను". ఆవిడ పోయాక నిజంగా ఆత్మీయంగా రాశాను.

పి.ఆర్.స్వామి "గొల్లపూడి రచయితల్లో పూలపుప్పొడి" అన్నారు.

నా కాలమ్ రచనలో "The Slum dog Millionnaire" మీద నేను రాసిన కాలమ్‌ని వ్యతిరేకిస్తూ ఎందరో పత్రికల్లోనే రాశారు. సినీమా ఎంత గొప్పగా ఉన్నా మన దేశాన్ని అంత హీనంగా, పేదగా, దయనీయంగా చూపడం నాకు బొత్తిగా నచ్చలేదు. ఆ విషయాన్నే నిర్దుష్టంగా, కుండబద్దలు కొట్టినట్టు రాశాను. (తీరా ఆ సినిమాకు కొన్ని ఆస్కార్ బహుమతులు వచ్చాయి. ఎందుకు రావు? ఇండియా ఇంకా అడుక్కునే, నేలబారు దశలోనే ఉన్నదని భావించేవారు, భావించి చంకలు గుద్దుకునేవారు ప్రపంచంలో చాలామంది ఉన్నారు.)

నా కాలమ్ మీద ఒక్క వ్యక్తి స్పందన నాకు బాగా గుర్తుండిపోయింది. మా పెద్దబ్బాయి. "చాలా గొప్పగా ఉంది. కిట్టప్ప చేత ఇంగ్లీషులో రాయిస్తాను. ఇది కాలమ్ కాదు. థీసిస్."You deserve a doctorate for this అంటూ మరొక మాట అన్నాడు: "I may or may not get an opportunity to say this, I would like to be born as your son again."

అన్నది కొడుకు కనుక ఇందులో 98శాతం మినహాయించినా కాలమ్ మీద వ్యామోహం ఈ వాక్యాలను ఇక్కడ ఉటకింపజేసింది.

టేకుమళ్ళ వెంకటప్పయ్య అనే పాఠకుడు ఒక పద్యం రాశాడు:

**రచనయందు మరి నవరసములందు**

**ఆరి తేరెను మారుది ఆది నుండి**

**యెడద పొంగగ, చదువగ యెవరికైన**

**గొల్లపూడి శైలి మదిని కొల్లగొనియె**

సాక్షిలో నా కాలమ్ "అమ్మ" చదివి మధురాంతకం నరేంద్ర ఫోన్: "సార్ ఈ రోజు కాలమ్ నన్ను గురించి రాసినట్టుంది సార్. ఒక్క అక్షరం కూడా అదనంగా కానీ, తక్కువగానీ లేకుండా రాశారు సార్. మా నాన్నని జ్ఞాపకం చేశారు"

సాక్షి కాలమ్‌కి ఫోటో కోసం మల్లాది నరసింహశాస్త్రిగారికి (మల్లాది రామకృష్ణశాస్త్రిగారబ్బాయి) ఫోన్ చేశాను. ఆయనా నేనూ ఆలిండియా రేడియోలో కలిసి పనిచేశాం. కలిసి హైదరాబాదులో "కళావని" అనే సంస్థని నిర్వహించాం. ఆ రోజుల్లో అనితర సాధ్యమైన రీతిలో 'తెలుగు నాటకరంగం' మీద వంద వ్యాసాల అపురూపమయిన గ్రంథాన్ని వెలువరించాం. శాస్త్రిగారు ఫోన్‌లో అన్నారు: "ఈ మధ్య మా నాన్నగారివి కొన్ని స్క్రిప్ట్స్ చేతికొచ్చాయి. మీరు చూస్తే ఆనందిస్తారు. మీకు కొన్ని అప్పగించాలి. ఎన్నిరోజులుంటామో తెలీదు. ఇలాగ కొందరం మిగిలాం. ఆలశ్యం చెయ్యకుండా మీరు ఒకపూట మాతో గడిపేటట్టు రండి. చాలా చూపించాలి. చాలా మాట్లాడుకోవాలి"

ఇంతవరకు ప్రశంసలతో ఊదరగొట్టేస్తున్నానని పాఠకులు భావించవచ్చు. దానికి చాలా కారణాలున్నాయి. నా వయస్సు, సీనియారిటీని దృష్టిలో పెట్టుకుని నాతో ఏకీభవించనివారు బహుశ నాకు ఉత్తరాలు రాయరు. నన్ను విమర్శించే ఉత్తరాలు బొత్తిగా నాకు చేరవు. అలాంటి ఒక అరుదయిన ఉత్తరాన్ని ఇక్కడ ఉటకించాలి.

ఒక మహాకవి, పండితుడూ అయిన వ్యక్తిని ప్రశంసిస్తూ కాలమ్ రాశాను. అన్ని విధాలా ఆ ప్రశంసకు ఆయన అర్హుడు. సందేహంలేదు. నెల్లూరునుంచి యద్దనపూడి రాజేశ్వరరావు అనే ఆయన ఒక పోస్టుకార్డు రాశారు. ఆ పండితుని నిర్వాకాన్ని గురించి విపులగా వివరించి "ఫన్‌డే ఆదివారం సంచికలో వస్తున్న డైరీ - మనస్సాక్షి బోరింగుగా ఉంది. తమకు 70 సంవత్సరాలు వచ్చాయి. ఈ చెత్త రాతలు మాని ఆధ్యాత్మిక జీవనం సాగిస్తే మంచిది. ఫన్‌డేలో వస్తున్న మీ గొప్పలు ఎవరికి కావాలి?" ఈ విమర్శ నాకు చేరిన అరుదైన కార్డు.

"ప్రేమ" నన్ను ఎక్కువగా పురికొల్పి కవితవేపు తరుముతుంది. ఆలిండియా రేడియో మద్రాసు కేంద్రంలో పనిచేసే రోజుల్లో ఓ ఆంగ్లో ఇండియన్ అమ్మాయికి తెలుగు రచయిత గొప్పతనం చెప్పడం ఎలా? ప్రయత్నించి ఇంగ్లీషులో కవిత్వం వ్రాయడం పరిశ్రమ చేసి పుంఖాను పుంఖంగా రాశాను.

నా డైరీలో 2008 డిసెంబరు 25 రాత్రి శ్రీదేవి అనే అమ్మాయి ఫోన్ చేసింది రోజా నాతో పదినిముషాలు మాట్లాడాలని షరతు. పదినిముషాల్లో ఫోన్ చేయమంది. నేను చేయలేదు. మళ్ళీ తనే చేసింది. వెంటనే అప్పటికప్పుడు రాసిన గేయం చదివి వినిపించాను.

**ఆలోచన్ని పదిలంగా**
**మడత పెడితే నిద్రవుతుంది.**
**కోరికల్ని రహస్యంగా**
**మడత విప్పితే కలవుతుంది**
**నువ్వు నా నిద్రలో కలవి -**
**కలకోసం ఎదురుచూసే నిద్రవి**

శ్రీదేవి థ్రిల్ అయింది. ఇదీ ఎంట్రీ.

మరో పదినిముషాలకి ఈసారి నేను ఫోన్ చేశాను - కవిత చదవడానికి.

**ఒంటరితనం ఆలోచనల్ని**
**అలంకరించుకుంటుంది -**
**ఆలోచనలు అవసరాల**
**రెక్కలు చాస్తాయి**
**ఏకాంతం దిక్కులు చూస్తుంది**
**నరాలమీద వరాల రాగాల్ని సంధిస్తుంది**
**కోరిక దొంగ పేరు 'స్నేహం'**

ఇంతకీ ఎవరీ శ్రీదేవి? ఆటు తర్వాత ఎప్పుడూ జీవితంలో తారసపడిన గుర్తులేదు. మా సఖ్యత - ఒక సాయంకాలం - నాలుగు ఫోన్ కాల్స్ వయస్సు.

*( కొనసాగింపు వచ్చేనెలలో)*

Post your comments